

*వైరా.. జన జాతర!* మంగళవారం ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు

# సూర్యాపేట గులాబీ తోట

- జనగర్జనతో దద్దరిల్లిన డోర్నకల్
- మధిర ప్రభంజనం..కదిలొచ్చిన వైరా
- బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాద సభలకు భారీగా తరలొచ్చిన ప్రజలు
- జననేత కేసీఆర్‌కు జేజేలు

ఖమ్మం, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/సూర్యాపేట/నర్సింహులపేట: సూర్యాపేట పట్టణమంతా గులాబీపూల వనం పూసింది.. డోర్నకల్‌లో జనభేరి మోగింది. మధిరలో ప్రభంజనం హోరెత్తగా, వైరాను జన ఉప్పెన ముంచెత్తింది. సూర్యాపేట, మధిర, వైరా, డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడలో మంగళవారం సీఎం కేసీఆర్ పాల్గొన్న బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాద సభలు సూపర్ సక్సెస్ అయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థులు జగదీశ్‌రెడ్డి, రెడ్యానాయక్, కమల్‌రాజ్, మదన్‌లాల్ అధ్యక్షతన జరిగిన ఆయా సభలకు వెల్లువలా జనం తరలివచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రం జన జాతరను తలపించింది. సాయంత్రం 4 గంటలకు సభ ఉండగా, 3 గంటలకే సభాప్రాంగణం నిండిపోయింది. చుట్టూ రెండు కిలోమీటర్ల మేర రోడ్లపైన జనం, వాహనాల రద్దీ కనిపించింది. జనం తండోపతండాలుగా రావడంతో వీఐపీ గ్యాలరీలోకి ప్రజలను అనుమతించారు. దీంతో సీఎం సభావేదిక వరకు ప్రజలు వచ్చారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రస్తావించినప్పుడు జనం నుంచి భారీ స్పందన వచ్చింది. నియోజకవర్గానికి ఆటోనగర్, పారిశ్రామికవాడ ఏర్పాటు చేయాలని మంత్రి జగదీశ్‌రెడ్డి కోరగా, వాటితోపాటు డ్రైపోర్టు కూడా ఇస్తానని సీఎం ప్రకటించడంతో ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఈసారి మంత్రి జగదీశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి.. ఇంతకంటే ఎక్కువగా అభివృద్ధి చేసి చూపిస్తానని కేసీఆర్ భరోసా ఇచ్చారు.

### కత్తి ఒకరికిచ్చి యుద్ధం మరొకరిని చేయమంటే ఎలా?

ఖమ్మం జిల్లా మధిర, వైరా నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు జన ఉప్పెనను తలపించాయి. ఊళ్లకు ఊళ్లు జనం ప్రభంజనంగా తరలివచ్చారు. సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. సీఎం మాట్లాడుతున్నంత సేపు ఈలలు, కేరింతలతో మద్దతు పలికారు. మధిరలో అక్కడి కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క ప్రస్తావనను సీఎం తీసుకొచ్చినప్పుడల్లా, వంగ్యాస్త్రాలు సంధించినప్పుడల్లా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం మరొకరిని చేయమంటే సాధ్యం కాదని, ఈసారి భట్టి విక్రమార్కను ఓడించి కమల్‌రాజును గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం ప్రస్తావించినప్పుడు ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలతో మద్దతు తెలిపారు. వైరా సభలో సీఎం కేసీఆర్ కొందరు కాంగ్రెస్ నాయకుల డబ్బు అహంకారంపై పదునైన బాణాలు వదిలారు. కొందరు కన్నూమిన్నూ కానకుండా మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటు తాకనివ్వబోమంటూ మాట్లాడుతున్నారని, అసలు అసెంబ్లీ గేటు దాటనీయకపోవడానికి వారెవరని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి, నోట్ల స్వాములకు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున కరతాళధ్వనులతో మద్దతు తెలిపారు. వైరా, మధిరల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే ఈ ప్రాంతాల అభివృద్ధికి తాను బాధ్యత తీసుకుంటానని భరోసా ఇవ్వడంతో ఆనందంతో సందడి చేశారు.



*ఖమ్మం జిల్లా మధిర సభలో ఉత్సాహంగా ఈలవేస్తున్న ఓ మహిళ*

### ఆటాపాటలతో మైమరిచిన జనం

మహబూబాబాద్ జిల్లా మరిపెడలో డోర్నకల్ జనసంద్రమైంది. వెల్లువలా జనం తరలివచ్చారు. గులాబీ జెండాలే రామక్క పాటతోపాటు కళాకారుల ఆటపాటలకు మహిళలు, యువకులు ఉత్సాహంగా ఎక్కడికక్కడ నృత్యాలు చేశారు. కేసీఆర్ ప్రసంగ సమయంలో జనం చప్పట్లు, ఈలలతో పరిసర ప్రాంతం మార్మోగింది. సభాస్థలిలో ఎంత మంది ఉన్నారో బయటా అంత కంటే ఎక్కువగా కనిపించారు. మీరు ఎమ్మెల్యేగా రెడ్యాను గెలిపిస్తే ఆయనకు మంచి హోదా కల్పిస్తానని చెప్పడంతో జనం చప్పట్లు, ఈలలతో మద్దతు ప్రకటించారు.

# రైతుకు కవచం కేసీఆర్

మొదటిపేజీ తరువాయి...

పెట్టడమే తమ విధానమని బీజేపీ స్పష్టం చేసింది. స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని ఒప్పుకున్నారు. మంగళవారం ఆమె హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రాలు రుణం రూపంలో నిధులు సేకరించుకోవాలంటే మోటర్లకు మీటర్లు పెట్టాలని నిబంధన విధించాం. అన్ని రాష్ట్రాలు మోటర్లకు మీటర్లు పెట్టి నిధులు తీసుకున్నాయి. తెలంగాణలో మాత్రం పెట్టలేదు. నిధుల సేకరణకు మేం అనుమతి ఇవ్వలేదు' అని పేర్కొన్నారు.

దీంతో 'మోదీ ప్రభుత్వం మోటర్లకు మీటర్లు పెట్టుమని ఒత్తిడి తెస్తే.. నా తల తెగిపడినా సరే మీటర్లు పెట్టను అని చెప్పిన' అన్న సీఎం కేసీఆర్ మాటే నిజమని స్వయంగా కేంద్ర మంత్రి ఒప్పుకున్నట్టయ్యింది. తద్వారా ఈ దేశంలో రైతు పక్షాన నిలబడిన ఏకైక, దమ్మున్న నాయకుడు సీఎం కేసీఆర్ అని స్పష్టమైంది. అంతేకాదు.. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో మోటర్లకు మీటర్లు పెట్టారు. ఇందులో కాంగ్రెస్ పాలిత, ఇండియా కూటమి పాలిత రాష్ట్రాలు కూడా ఉన్నాయి. అంటే కాంగ్రెస్ విధానమే 3 గంటల కరెంటు, మోటర్లకు మీటర్లు అని స్పష్టమవుతున్నది.

### 12 రాష్ట్రాల్లో మోటర్లకు మీటర్లు

2021-22 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్డీపీ విలువల రూ.11.54 లక్షల కోట్లు. ఈ లెక్కన కేంద్రం చెప్పినట్టుగా మోటర్లకు మీటర్లు బిగిస్తే రాష్ట్రానికి సుమారు రూ.5,700 కోట్ల మేర అదనపు నిధులు సేకరించే అవకాశం ఉండేది. అంటే ఐదేండ్లకు దాదాపు రూ.25 వేల కోట్లకుపైగా రాష్ట్రానికి అదనంగా నిధులు వచ్చేవి. కానీ సీఎం కేసీఆర్ ఎట్టి పరిస్థితుల్లోనూ మోటర్లకు మీటర్లు పెట్టే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. మరోవైపు దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు ఈ ఏడాది జూన్ వరకే మోటర్లు బిగించాయి. రూ.66 వేల కోట్ల మేర అదనపు నిధులు పొందాయి. ఇందులో బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్, అస్సాం, మణిపూర్, కాంగ్రెస్ పాలిత రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ప్రస్తుతం ఇండియా కూటమిలోని పార్టీలు అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు వంటివి.. ఏపీ, ఒడిశా, మేఘాలయ వంటి రాష్ట్రాలు కూడా ఉన్నాయి. మరో 8 రాష్ట్రాలు తాము మోటర్లకు మీటర్లు పెడుతున్నామని, వాటిని పరిశీలించి రుణం ఇవ్వాలని కేంద్రానికి దరఖాస్తు చేసుకున్నాయి. అంటే.. దేశవ్యాప్తంగా ఉన్న పెద్ద రాష్ట్రాలన్నీ మోటర్లకు మీటర్లు పెడుతున్నాయి. కానీ కేంద్రాన్ని ఎదిరించి రైతుల పక్షాన నిలబడిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని స్పష్టం అవుతున్నది.

### మొదటి నుంచీ రైతుల కరెంటుపై కుట్ర

*బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉచిత విద్యుత్తుకు మంగళం పాడాలని శతవిధాలా ప్రయత్నిస్తున్నది. రైతును ఆదుకుంటున్న ఈ పథకాన్ని ఏ విధంగానైనా ఎత్తివేయాలని అనేక కుట్రలు చేసింది. సామ, దాన, బేధ, దండోపాయాలను వాడింది. ముందుగా.. విద్యుత్తు చట్ట సవరణ బిల్లును అస్త్రంగా వాడింది.*

- 2020 ఏప్రిల్ 17న రాష్ట్రాలకు పంపిన ముసాయిదాలో.. 'రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పొందే వర్గాల నుంచి డిస్కమ్‌లు ముందుగా బిల్లులు వసూలు చేయాలి. ఆ తర్వాత కావాలంటే నగదు బదిలీ రూపంలో వారికి తిరిగి ఇవ్వవచ్చు' అని పేర్కొన్నది. అంటే రైతుల నుంచి కరెంటు బిల్లు వసూలు చేయాలని స్పష్టంగా చెప్పింది. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గింది. కొంతకాలం తర్వాత రెండో కుట్రకు తెరలేపింది.
- 2020 డిసెంబర్ 31న విడుదల చేసిన విద్యుత్తు వినియోగదారుల హక్కుల నిబంధనల్లో 'మీటర్లు లేకుండా విద్యుత్తు కనెక్షన్ జారీ చేయరాదు' అని స్పష్టం చేసింది. ఆ తర్వాత రెండు నెలలకే మూడోసారి కుట్ర చేసింది.
- 2021 ఫిబ్రవరి 5వ తేదీన రాష్ట్రాలకు పంపిన విద్యుత్తు చట్ట సవరణ రెండో ముసాయిదాలో 'ఏ రంగంలో అయినా విద్యుత్తు కనెక్షన్‌కు మీటర్ తప్పనిసరి' అని ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ సహా అనేక రాష్ట్రాలు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించినా మోటర్లకు మీటర్లపై వెనక్కి తగ్గలేదు. దీంతో రాష్ట్రాలకు నిధుల ఆశ చూపెట్టాలని ప్రయత్నించింది. ఆ ఏడాది మార్చిలో ప్రవేశపెట్టిన 2021-22 బడ్జెట్‌లో 'విద్యుత్తు సంస్కరణలకు ఒప్పుకున్న రాష్ట్రాలకు ఎఫ్ఆర్బీఎం పరిమితికి అదనంగా జీఎస్డీపీలో 0.5 శాతం రుణాలు తీసుకోవడానికి అనుమతిస్తాం' అని చెప్పింది. ఈ సడలింపును ఐదేండ్లపాటు అమలు చేస్తామని ప్రకటించింది. అంతటితో ఆగలేదు..
- 2021 ఏప్రిల్ 27న విడుదల చేసిన జాతీయ విద్యుత్తు విధాన ముసాయిదాలో.. ఈ పాలసీ నోటిఫికేషన్ వెలువడిన ఏడాదిలోగా మీటర్లు బిగించాలని ఆదేశించింది.
- 2021 అక్టోబర్ 6న అమల్లోకి తెచ్చిన కొత్త ఆడిట్ నిబంధనల్లో 'మూడేండ్లలో వినియోగదారులందరికీ కమ్యూనికేబుల్ మీటర్లు బిగించాలి' అని ఆదేశించింది. వీటన్నింటి లక్ష్యం ఒక్కటే.. రైతుల మోటర్లకు మీటర్లు బిగించడం. ఈ ప్రతిపాదనను సీఎం కేసీఆర్ ఒక్కడే మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ నేతలుగానీ, ఇతర పక్షాలుగానీ మోటర్లకు మీటర్ల విషయంలో కేంద్రాన్ని నిలదీయలేదు.

### కాంగ్రెస్ వస్తే 3 గంటల కరెంటు, మోటర్లకు మీటర్లు

రాష్ట్రంలో ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి 24 గంటల కరెంటును బంద్ చేసి, 3 గంటలు ఇవ్వడంతోపాటు.. ప్రతి మోటర్‌కు మీటర్ పెడతారని స్పష్టమవుతున్నది. కేంద్రం చెప్పినట్టు మోటర్లకు మీటర్లు పెట్టి, అదనంగా నిధులు సేకరించిన రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలితన రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ వంటివి ఉన్నాయి. అంతేకాదు... రైతుల ఉసురుపోసుకొని నిధులు తీసుకున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలిత రాజస్థాన్ టాప్‌లో ఉన్నది. ఆ రాష్ట్రం ఇప్పటివరకు రూ.11,308 కోట్లు నిధులు సేకరించింది. కర్ణాటకలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మోటర్లకు మీటర్లు పెట్టి డబ్బులు దండుకోవడంపై దృష్టిపెట్టింది. ఈ ఏడాదికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేర్కొన్న రాబడుల్లో విద్యుత్తు సంస్కరణల ద్వారా సేకరించే 0.5 శాతం నిధులు ఉంటాయని పేర్కొన్నది. అంటే.. మోటర్లకు మీటర్లు పెట్టినందుకు తమకు ఈ ఏడాది నుంచి డబ్బులు వస్తాయని చెప్పుకున్నది.







కోహెడలో మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్ నిర్వహించిన రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు

# రైతులే ముఖ్యం.. మీటర్లు పెట్టం

- మీటర్లు పెట్టలేదని కేంద్రంలోని బీజేపీ రూ.25 వేల కోట్లు ఆపింది
- కేంద్ర మంత్రి నిర్మల నిజం ఒప్పుకున్నరు
- ప్రాణం ఉండగా మీటర్లు పెట్టనన్న కేసీఆర్
- మాకు 62 లక్షల రైతులే ముఖ్యమన్నరు
- కాంగ్రెస్ 6 గ్యారెంటీలేమో గానీ.. ఆరు నెలలకు ఓ సీఎం పక్కా
- హుస్నాబాద్ రోడ్‌షోల్లో మంత్రి హరీశ్



*సిద్దిపేట జిల్లా అక్కన్నపేట రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్, పెద్దిరెడ్డి*

**కాంగ్రెస్ అందంగా రైతులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నది. మ్యానిఫెస్టోలో ప్రతి రైతుకు రూ.15 వేలు అని రాసింది. కేసీఆర్ మాత్రం ప్రతి ఎకరానికి రూ.16 వేలు ఇస్తామంటున్నారు. మీకు మూడెకరాలు ఉన్నా కాంగ్రెస్ వాళ్లు రూ.15 వేలే ఇస్తరు. అదే మూడెకరాలు ఉంటే కేసీఆర్ రూ.48 వేలు ఇస్తరు. కాంగ్రెస్ మర్మాన్ని ప్రజలు గుర్తించాలి. ఆ పార్టీ మ్యానిఫెస్టోలో ఏటా అని మాత్రమే ఉన్నది. ప్రతి ఎకరాకు అని ఎక్కడా లేదు. తస్మాత్ జాగ్రత్త.**

**- మంత్రి హరీశ్‌రావు**

సిద్దిపేట (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కరీంనగర్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ సర్కారుకు, సీఎం కేసీఆర్‌కు రైతులే ముఖ్యమని, అందుకే రైతుల బాయికాడ మీటర్లు పెట్టలేదని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. రైతుల బాయిలకాడ మీటర్లు పెట్టాలంటే, పెట్టనందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణకు రూ.25,000 కోట్లు ఆపేసిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ స్వయంగా ఒప్పుకున్న విషయాన్ని గుర్తు చేసిన హరీశ్.. ఇప్పటిదాకా మనం ఏం చెప్పామో, అదే ఈ రోజు ఆమె ఉన్నది ఉన్నట్టు బయట పెట్టారని అన్నారు. 'తెలంగాణవాళ్లు బాయిలకాడ మీటర్లు పెట్టలేదు. దేశం అంతా, పక్క రాష్ట్రాల వాళ్లు మీటర్లు పెట్టినారు. వాళ్లకు డబ్బులు ఇచ్చినం. తెలంగాణవాళ్లు మీటర్లు పెట్టలేదు. కాబట్టి డబ్బులు ఇవ్వలేదు' అని కేంద్ర మంత్రి కుండబద్దలు కొట్టారని స్పష్టం చేశారు. మోటర్లకు మీటర్లు అని బీజేపీవాళ్లు, మూడు గంటల కరెంట్ అని కాంగ్రెస్‌వాళ్లు అంటున్నారని, సీఎం కేసీఆర్ మాత్రం 24 గంటల కరెంట్ ఇస్తున్నారని వివరించారు. దీన్ని బట్టే ప్రజలు ఎటువైపు ఉంటారో తేల్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహెడ, చిగురుమామిడి, అక్కన్నపేట, హుస్నాబాద్ మండల కేంద్రాల్లో నిర్వహించిన రోడ్ షోల్లో ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ చెప్పిన మాయమాటలు నమ్మి తాము మోసపోయామని, మీరు మోసపోవద్దని కర్ణాటక ప్రజలు తెలంగాణకు వచ్చి చెప్తున్నారని గుర్తుచేశారు. ఆ రాష్ట్రంలో ఎన్నికలప్పుడు గల్లీగల్లీ తిరిగిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పుడు జాడ లేకుండా పోయారని ఎద్దేవా చేశారు. ఇటు ఆ పార్టీ నాయకుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3 గంటల కరెంట్ ఇస్తే చాలని అంటున్నారని, 3 గంటల కరెంట్‌తో 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని పారించుకోవాలని చెప్తున్నారని, ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. విరామం లేకుండా కరెంట్ ఇచ్చే కేసీఆర్‌ను విరామం లేకుండా గెలిపించుకుందామని అన్నారు. ఉద్యమ సమయంలో జై తెలంగాణ అన్న వారిమీదికి కాల్చిపారేస్తానని రేవంత్‌రెడ్డి తుపాకి పట్టుకొని కరీంనగర్ మీటింగ్‌కు రాలేదా? పేగులు తెగేదాకా కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నది మనమైతే తుపాకి చేతిలో పట్టుకొని తిరిగిన తుపాకి రాముడు రేవంత్‌రెడ్డి అని అన్నారు.

### కాంగ్రెస్‌లో ఆర్నెల్లకో సీఎం

కాంగ్రెస్ వాళ్లది సుతి లేని సంసారమని, ఆ పార్టీలో మూడు గ్రూపులు ఉంటాయని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఇదే కరీంనగర్ జిల్లాలో శ్రీధర్ బాబుది ఒక గ్రూపు, పొన్నం ప్రభాకర్‌ది ఒక గ్రూపు, జీవన్‌రెడ్డిది ఒక గ్రూపు ఉంటదని, వీళ్లు ఒకల మాటలు ఒకలు వినరని విమర్శించారు. ఆరు గ్యారెంటీల మాట దేవుడెరుగు, ఆరె నెలలకో సీఎం మాత్రం గ్యారెంటీ అని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ కోసం ఈసీకి లేఖ రాశామని, అనుమతి రాగానే వారంలో పూర్తి చేస్తామని తెలిపారు. అనుమతి రాకపోయినా, డిసెంబర్ 3 తర్వాత వచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వమే మిత్తితో సహా పూర్తిచేస్తామని స్పష్టం చేశారు.

### అన్ని రంగాల్లో హుస్నాబాద్ అభివృద్ధి

కేసీఆర్ సీఎం అయ్యాక ఎమ్మెల్యే సతీశ్ నేతృత్వంలో హుస్నాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని హరీశ్‌రావు అన్నారు. కోర్టుల్లో కేసులు వేసి గౌరవెల్లి ప్రాజెక్టు జరగకుండా కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటే, మనం పూర్తిచేసుకున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. సతీశ్ కుమార్ చాలా మంచి వ్యక్తి అని, ఆయనను ఎవరు కూడా విమర్శించరని, ఎవరైనా ఆయన ఇంటికి వెళ్లితే అన్నం తినివచ్చారా? అని అడుగుతారని అన్నారు. కడుపు నిండా అన్నం పెట్టే ఇల్లు వాళ్లదని చెప్పారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఎంపీపీ కొత్త వినీలాశ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.